

# సుందరి

అనగనగనగా కాంచనపురంలో ధనగుప్తుడనే వర్తకుడొకడుండేవాడు. అతనికి కలిగిన సంతానం ఆరుగురు. వారిలో మొదటి ముగ్గురు కొడుకులు. మిగిలిన ముగ్గురు కుమార్తెలు.

ధనగుప్తుడు కాంచనపురంలో ఉన్న వర్తకులందరిలోను గొప్ప ఐశ్వర్యవంతుడని పేరు పొందాడు. అంతేకాక చిన్నప్పటి నించీ చాలా కష్టపడి చదువుకున్నవాడు. అందుచేత తన పిల్లలందరికీ మొదటి నించీ చాలా జాగ్రత్తగా చదువు చెప్పించాడు.

ఆడపిల్లలందరు చక్కని చుక్కలే. అందులోను ఆఖరిపిల్ల సాక్షాత్తూ అప్సరసే. చూసినవాళ్లంతా ఆఅమ్మాయిని 'సుందరీ!' అని పిలిచేవారు. వయుస్సు వచ్చిన కొద్దీ ఆ సుందరిని చూసిన జనం అంతా కాంచనపురంలో ఇహ ఇంతటి అందగత్తె లేదని అనుకుని ఆశ్చర్యపోతూండేవారు. చివరికి కొంత కాలానికి ఆమె పేరే 'సుందరి'గా మారిపోయింది. సుందరి అందరికీ అల్లారు ముద్దుగా పెరిగి పెద్దదైంది. క్రమంగా ఆమె పేరు ఆ దేశంలో నాలుగు మూలలా వ్యాపించింది. ఆమె గొప్ప అందగత్తె అని పేరు మోసిన కొద్దీ అక్కలిద్దరికీ సుందరి మీద అసూయ పెరగడం ప్రారంభించింది.

అందంలోనే కాక గుణాల్లో కూడా సుందరి అక్కలిద్దరినీ మించింది. వారిద్దరు తమ ఐశ్వర్యం తలుచుకుని మురిసిపోతూ కన్నూ మిన్నూ కానకుండా తిరుగుతూండేవారు. ఇరుగుపొరుగు వాళ్లమ్మాయిలెవరయినా చూడడానికి వస్తే 'బొత్తిగా తీరిక లేదమ్మా' అని చెప్పి తిరగగొడుతూ ఒంటిపిల్లి రాకాసుల్లా ఉండేవారు. నగలతో తులతూగుతూన్న వాళ్లెవళ్లైనా వస్తే ఎల్లాగోల్లాగ కొంచెం కళ్లెత్తి వారికేసి చూసేవారు. పొద్దస్తమానము పేరంటాల్లోను, విందుల్లోను, వినోదాల్లోను మునిగి తేలుతూ. చెల్లెల్ని దూరదూరంగా తరిమి వేసేవారు.

[illegible]

సుందరి ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం పుచ్చుకుని చదువుకుంటూ ఉండేది. ఇది చూసిన కొద్దీ అక్కలిద్దరికీ బాగా గుర్రగా ఉండేది. అందుచేత ఆమెను వెక్కిరించి వెకిలికోళా లాడుతూ హేళన చేస్తూండే వారు.

క్రమంగా ఈ ఆడపిల్లలందరికీ పెద్ద పెద్ద పెళ్లి సంబంధాలు వస్తూండేవి. ఎంత పెద్ద సంబంధం వచ్చినా పెద్దపిల్లలిద్దరు కొండెక్కి కూర్చుని, రాజకుమారులెవరో దిగి వచ్చేదాకా పెళ్లాడమని మూతి బిగించుకునే వారు. చిన్నపిల్ల మాత్రం పెళ్లిమాట వచ్చేసరికి సిగ్గుపడుతూ "ఇంత చిన్నతనంలో అప్పుడే పెళ్లేమిటి? నా చదువంతా పాడైపోతుంది బాబూ!" అని చెప్పి వాళ్లమాటలు విని విననట్లుగా మాట్లాడకూరుకునేది. అస్తమానము తండ్రి వెంట వెంటనే తిరుగుతూ జాగ్రత్తగా చదువుకుంటూండేది.

ధనగుప్తుడు ఓడలమీద విదేశాలతో వర్తకం చేస్తూ క్రమంక్రమంగా కోటికి పడగెత్తాడు. కాని హఠాత్తుగా అతనికొక పెద్ద ఆపత్తు వచ్చింది. ఒకసారి, సముద్రంలో



పెద్ద తుపానువచ్చి అతని ఓడలన్నీ మునిగిపోయాయనీ, సరుకంతా సముద్రంలో మునిగిపోయిందనీ వార్త వచ్చింది. పాపం అతను గడించిన డబ్బంతా పూర్తిగా నష్టపోయాడు. అప్పులవాళ్లు వచ్చి మాఅప్పు తీర్చేదాకా 'గుమ్మం కదలమని గుండెలమీద కూర్చున్నారు. చివరికి ధనగుప్తుడు తన ఆస్తిఅంతా అమ్మివేసి ఎల్లాగో అల్లాగ ఆ అప్పులలోనించి ఇవతల పడ్డాడు. ఇంక అతనికి మిగిలిందల్లా ఒక పల్లెలో ఉన్న పూరిగుడిసె మాత్రమే. ధనగుప్తుడి కుటుంబం ఇక దిక్కులేక తలదాచుకోడానికి ఆపల్లెటూరు జేరుకున్నారు.

ఒకనాడు ఉదయం తండ్రి పిల్లలందరినీ దగ్గిరికి పిలిచాడు. వారందరు అతనిచుట్టు మూగారు. పాపం! ధన గుప్తుడేదో చెప్పబోయాడు గాని అతనికి నోటమ్మట మాటరాలేదు. కన్నీళ్లు అదే ధారగా ప్రవహించడం మొదలు పెట్టాయి.

చివరికి ఎల్లాగో అల్లాగ ధైర్యం చిక్కబట్టి పిల్లలకేసి చూస్తూ "మన ఓడలన్నీ సముద్రంలో మునిగిపోయాయి. ఆస్తి అంతా అప్పులవాళ్ల పాలైపోయింది. ఇంక మనమే ఎల్లాగో అల్లాగ కష్టపడి ఏ వ్యవసాయమో చేసుకుంటూ ఈగుడిసెలో తల దాచుకొని బతకాలి. మనకింతకంటె వేరే ఆధారమేమీ లేదు." అన్నాడు.

మొగపిల్లలు "సరే! అల్లాగే కష్టపడదాం! ఏం జేస్తాం మరి!" అన్నారు.

ఆడపిల్లల్లో పెద్దవాళ్లిద్దరు "సరి! సరి! మేమెప్పుడైనా ఇల్లాంటి పనులు చేశామా! ఏమన్నావా! ఈ మోటుపనులు మేం చెయ్యలేం బాబూ!" అని మూతి ముడుచుకున్నారు. లోలోపల వాళ్లిద్దరు "ఏజమీందారీ సంబంధమో వస్తే హాయిగా అత్తారింటికి వెళ్ళి సుఖపడవచ్చును. దానితో ఈశని అంతా ఒక్కసారిగా విరగడై పోతుంది" అని కలలు కంటూండే వాళ్లు.

అయితే ఉన్న ఐశ్వర్యం కాస్తా హరించుకు పోయేసరికి జమీందారైవరూ వీళ్ల మొహాల కేసైనా చూసేవాళ్లు కారు. పైపెచ్చు పెద్ద పిల్లలిద్దర్ని చూసి "తండ్రి దగ్గర కాస్త డబ్బు జేరేసరికి ఇక ఒళ్లుపైన తెలియకుండా తిరుగుతూండే వాళ్లులే! ఇక వీళ్లరోగం చప్పగా కుదిరిపోతుంది. ఇక్కడినించి పేడ తట్టలు మోస్తూ పిడక లమ్ముకుని బతకవలిసిందే!" అని చంకలు కొట్టుకున్నారు.

కాని సుందరి కష్టాలు చూస్తూంటే అందరికీ జాలిగానే

(42-ఎ పేజీ చూడండి)

# ★ సుందరి ★

(37-వ పేజీ తరువాయి)

ఉండేది. ఆమె ఇబ్బందులు పడుతూంటే చూసిన వాళ్లందరికీ కళ్లు చెమ్మగిలేవి. కొంతమంది జమీందారులు ముందుకువచ్చి ఆమెను వివాహం చేసుకోవాలని ఉవ్విళ్లూరారు. అయినా సుందరి ససేమిరా అని చెప్పి తండ్రికిఅన్నిపనులలోను ఆసరాగా ఉంటూండేది. పాపం సుందరి మొట్టమొదట తనకువచ్చిన కష్టాలు భరించలేక కళ్లమ్మట నీళ్లు పెట్టుకొనేది. కాని కొంత కాలానికి "కళ్లమ్మట నీళ్లు పెట్టుకుని లోలోపల కుములుతూ కూర్చుంటే ఏమి లాభం! ఎల్లాగో అల్లాగ ఉన్న దానితో తృప్తిపడి సుఖంగా కాలక్షేపం చెయ్యాలి." అని సమాధాన పడింది. అప్పటినించి తండ్రికి అనేకవిధాల సాయపడుతూ ఎంతో సంతోషంగా కాలక్షేపం చేస్తూండేది.

ఆపల్లెటూరికి మారినప్పటినించీ ధనగుప్తుడి కొడుకులు ముగ్గురు తమ ఇంటిదగ్గిర ఉన్న పొలం అంతా దున్ని అన్ని ఫలవృక్షాలు గల ఒక పెద్దతోట పెంచారు. పొద్దున్న, సాయంత్రం ఆతోటలోని ఫలవృక్షాలకన్నింటికి ఏతాంతోలి నీరు పెట్టేవారు.

సుందరి ప్రతిరోజూ తెల్లవారగట్లే లేచి ఇల్లంతా తుడిచి శుభ్రం చేసి తండ్రికి, అన్నలకు, అక్కలకు ఎంతో ఆప్యాయంగా అన్నం వండి పెట్టి, విసుక్కోకుండా పని అంతా తానొకర్తే చేస్తూండేది. అంతగా అలవాటు లేకపోవడం మూలాన్ని మొదట్లో ఆమె కిది అంతా కొంత కష్టంగానే ఉండేది గాని అలవాటయినకొద్దీ అదే హాయి అనిపించింది.

ఇల్లాగ ఇంటిపని అంతా పూర్తి చేసిన తరవాత మధ్యాహ్నం తీరికగా ఉన్నప్పుడు చదువుకుంటూ కాలక్షేపం చేసేది.

ఇంక అక్కలిద్దరికీ మరి ఆ పల్లెటూళ్లో కాలక్షేపం అయ్యేదే కాదు. అసలు లేవడమే పొద్దున్న పదిగంటలకి లేచేవారు. ఆపైన ఆవలించడం ఒక అరగంట పట్టేది! లేచి కాస్త అటూ ఇటూ తిరిగేసరికి అలిసిపోయి మళ్లీ తమ పరుపులమీదే కూలబడిపోయేవారు. మధ్యాహ్నం అంతా గుర్రుపెట్టి నిద్రపోయి, సాయంత్రం అయ్యేసరికి తోటలో ఒక చెట్టుకింద కూర్చుని తమకింక నగలు, సిలుకు చీరలు లేవుగదా అని ఆలోచిస్తూ దిగులుగా ఉండేవారు. చెల్లెలు ఉన్నవాటితోనే తృప్తిపడి సుఖంగా ఉండడంచూసి రుసరుసలాడుతూ ఆమె కంటబడేసరికి పెడమొహం పెట్టుకొని కూర్చునేవారు. అస్తమానమూ అయినదానికీ కానిదానికీ ఆమెను సాధించిపోస్తూ ఊరికే ఉత్త పుణ్యానికి శాపనార్థాలు పెడుతూండేవారు. ఇన్ని చేసినా సుందరి ఏమీ అనక నెమ్మదిగా తనపని తను చేసుకుపోతూండేది.

ఇల్లాగ ఆ పల్లెటూళ్లో ఒక సంవత్సరం గడిచిపోయింది. ఒకనాడు హఠాత్తుగా ధనగుప్తుడికి ఒక ఉత్తరం వచ్చింది. ఆఉత్తరం చదివేసరికి అతనికెంతో ఉత్సాహం కలిగింది. మునిగిపోయాయనుకున్న ఓడలు మునిగిపోలేదని అవి అన్నీ సురక్షితంగా రేవులోకి వచ్చాయనీ ఆఉత్తరంలో ఉంది. ఈసంగతి తెలియగానే అక్కలిద్దరు ఎగిరి గంతేశారు. మళ్ళీ చీరలు సింగారించుకుని కులుకుతూ సుఖంగా ఉండవచ్చుననీ హాయిగా పెళ్లిళ్లు చేసుకుని అత్తవారింటికి వెళ్లవచ్చునని ఉబలాటపడ్డారు.

ధనగుప్తుడు ఓడలు చూడడానికి బయలుదేరుతూంటే అక్కలిద్దరు అతని దగ్గిరికి వెళ్ళి వెంటనే తమకు సరికొత్త చీరలు, నగలు తీసుకు రావలిసిందని అడిగారు. సుందరి మాత్రం పుస్తకం ఏదో చదువుకుంటూ కూర్చుంది.

ధనగుప్తుడామె దగ్గిరకి వచ్చి "అమ్మా మనఓడలు చూడడానికి వెడుతున్నాను. తిరిగి వచ్చేటప్పుడు

## అల్లరిమాన్పించిన పెట్టె

కోసం వెతుకుతున్న, శివరామయ్యగారికీ, ఆయన భార్యకీ పిల్లవాడు దొరికాడని తెలిసింది. వాళ్లు ఒక్క పరుగున అక్కడికొచ్చి వేణూని అమాంతంగా ఎత్తుకున్నారు. వేణూ వాళ్లమ్మ ఇంకా ఏడుస్తూనే వుంది. "ఎక్కడికెళ్లావురా నాతండ్రీ?" అని ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ అడిగితే, అంతకంటె బిగ్గరగా ఏడ్చాడు వేణు.

ఇది జరిగి ఇప్పటికి చాలా రోజులైందనుకోండి - చెప్పొచ్చేదేమిటంటే ఆదెబ్బతో వేణూకు బుద్ధి వచ్చి, అల్లరి పనులు మానేశాడు. ★

నీకేం తీసుకు రమ్మన్నావు?" అని అడిగాడు.

సుందరి కొంత సేపటిదాకా ఏమీ సమాధానం చెప్ప లేదు గాని, చిట్ట చివరికి ఒక చిరునవ్వు నవ్వి "నాకు నగలు నాణాలు వద్దుగాని, ఒక చిన్న గులాబీపువ్వు తెచ్చి పెట్టండి!" అంది. నిజానికి సుందరికి గులాబిపు వ్వక్కర లేదుగాని, నగలు అవీ అడిగితే అప్పగార్లిద్దరికీ ఏం కోపం వస్తుందో అనే భయం చేత అలాగడిగింది. ఒకవేళ ఏమీ అక్కర్లేదని అంటే అక్కలిద్దరు "అబ్బో ఎంత వగలాడివే! నాన్న గారిచేత పొగిడించుకోవాలని ఏమీ అక్కర్లేదని అన్నావులే! నీటక్కులు మాకు తెలియవూ?" అని ఎగ తాళి చేసేశారు. అందుకని ఏదో ఒకటి అడగకపోతే బాగుండదని గులాబీపువ్వు కావాలని మాత్రం అడిగింది. అంతే!

తరవాత ధనగుప్తుడు ఓడల దగ్గిరికి వెళ్లాడు. ఏవో కొన్ని ఓడలు ఒడ్డుకు జేరుకున్నాయి గాని, అవి ఒడ్డుకు జేరుకునేలోగా కొందరు ఓడదొంగలు ఆఓడలలో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా దోచేశారు. అవన్నీ ఉత్తిఓడలే. వాటిలో ఒక్క చిల్లి గవ్వకూడా లేదు. ధన గుప్తుడికి ప్రాణం ఉసూరుమంది. ఆ ఒట్టి ఓడలన్నీ అక్కడే విడిచి పెట్టి మళ్లీ ఇంటికి ప్రయాణ మైనాడు.

దోవలో పెద్ద గాలివాన వచ్చింది. ఉరుములతోను, మెరుపుల తోను కుండపోతగా వర్షం కురిసింది.

ధనగుప్తుడీసమయానికొక కీకారణ్యంలోచిక్కుకున్నాడు ఆగాలిలోను, వానలోను అతనికి దారి తిన్నగా తెలియలేదు. తను ఎక్కివచ్చిన గుర్రం ఇక నడవలేక ఒక చెట్టు కింద కూలబడి పోయింది. అప్పటి కప్పుడే బాగా చీకటి పడింది. ఇంక ఆచీకటిలో అలాగే ప్రయాణం సాగిస్తే ఏ పెద్ద పులులైనా మింగేస్తాయేమోనని భయం వేసింది. చుట్టూరా పెద్దపులులు, సింహాలు గాండ్రు గాండ్రుమని అరుస్తున్న ధ్వనులు వినిపిస్తున్నాయి. ఆ విలో ఆరాత్రి ఎక్కడైనావిశ్రమిద్దామనుకుంటే అతనికెక్కడా దారీ తెన్నూ కనిపించ లేదు. భగవంతుడా! నాకిక దిక్కు లేదా!" అని దిగాలుపడి కూర్చున్నాడు. వర్షం అలాగే కురుస్తూంది. కీచురాళ్లు భయంకరంగా గీపెడుతున్నాయి. మధ్య మధ్య చెట్టుకొమ్మల్లో తల దాచుకున్న పక్షులు రెక్కలాడించినపుడల్లా అతని గుండె గుబగుబలాడేది. ఏదైనా దారి దొరకకపోతుందా అని అల్లాగే వానలో తడుస్తూ కొంత దూరం [illegible] సాగించాడు. ఇంతలో దూరంగా మినుకు మినుకు మంటూ ఒక చిన్న దీపం కనబడింద. (ఇంకాఉంది)



ఒంటిగీత బొమ్మ:
## మహారాణా ప్రతాప్.
జంధ్యాల సరోజ. (ద్రోణాచలం)